

— అపర్ణ

సారి. కొద్ది క్షణాలు తటపటాయించి, మరి బెట్టుచేయడం బాగుండ దనిపించి మొగమాటపడుతూనే లోపలి కొచ్చి అతడు చూపించిన కుర్చీలో కూర్చుం దా యువతి. పుస్తకాలు ఒడిలోకి తీసుకుని, ఆన్చిన మోచేతుల మధ్య ముఖాన్నుంచు కుని గది నలుమూలల పరికించిం దో మారు. వస్తువులన్నీ పొందిగ్గా అమర్చి ఉన్నాయి. రిఛ్‌నెస్‌కి, నీట్‌నెస్‌కి సంబంధం లేదనిపించింది. ఉన్నట్లుండి ఆమె కళ్ళు ఎదురుగా గోడవారన తగి లించి ఉన్న షెల్ఫ్ మీద ఆగిపోయాయి. జె. హెచ్. ఛేస్‘ఈవ్’,మామ్‘అప్ అండ్ ది విల్లా’, పెర్రీ మాసన్ ‘డూప్లికేట్ డాటర్.’ నొబకోవ్ ‘లోలిటా’, శ్రీపతి ‘మంచు పల్లకి మరి తొమ్మిది’, బుచ్చి బాబు ‘చివరకు మిగిలేది’, చలం ‘హంపీ కన్యలు’, విశ్వనాథ ‘చిట్లీచిట్లని గాజులు’, కామేశ్వరి ‘కొత్తనీరు’ ... మరెన్నో.

“పుస్తకాల్ని చూచి మనుషుల్ని అంచనా వెయ్యకండి.” షెల్ఫ్ కేసి నిలిచి పోయిన ఆమె చూపుల్ని గుర్తిస్తూ అన్నాడు సుందరం.

“అభిరుచిని చూస్తున్నాను.”

“మీ రూహిస్తున్నంత అభిరుచి కలవాణ్ని కాను.”

“కాలక్షేపానికి కొని చదివే పుస్తకాలు కావవి.”

‘నిజమే. తనకు ఊహ తెలిసి నప్ప ట్నుంచి పుస్తకాలంటే పంచప్రాణాలు. వాటిమీద అందమైన బొమ్మలంటే మరీను. వాటిలో ఎన్నో దొంగిలించు కొచ్చినవీ ఉన్నాయి. ఈ రోజుకూ వాటి మీద మక్కువను అరికట్టలేక పోతు న్నాడు. ఆ పుస్తకాల వెనక దాగిన భయం కరమైన నిజాలు ఆమెకి తెలిస్తే తల తిరిగి పోవచ్చు. అవును, తనలాటి కొద్ది మందికి చాలా దూరంలో నిలిచిన చాలా మందిలో ఆమె ఒకతె కాబట్టే.’ సుందరం మెదడంతా ఏవో వింత ఆలోచనలతో నిండిపోయింది.

బయట నిలువుగా కురుస్తూన్న వర్షం. తడిసిన యూనిఫామ్‌లో కేరిం తలు కొట్టుకుంటూ రోడ్డున పోతున్న కాన్వెంటు పిల్లలు. గాలి విసురుకు ఉండి ఉండి శరీరాన్ని తాకుతున్న వర్షపు తుంపర్లు.

“నా పేరు సుందరం. వృత్తి ...” పెదవి కదిపిన సుందరాన్ని — “మంచి పుస్తకాలు చదవడం. ఎందుకండీ, అంత ప్రయాస పడతారు నన్ను గురించి తెలుసుకోవడానికి? !” అని ఆర్డోక్తి లోనే ఆపి ఎదురు ప్రశ్న వేసింది. సుందరం బిత్తరపోయాడు ఆమె ధోర ణికి.

“నా పేరు గీత. చదువుతోంది సెకండ్ ఇయర్ బి. ఎ. మా నాన్నగారు ఇన్‌స్పెక్టర్ రాజారావ్.”

‘ఈ అమ్మాయి ఇన్‌స్పెక్టర్ రాజా రావ్ కూతురా? తనలాంటి వాళ్ళు కల్లో కనపడ్డానికి కూడా అసహ్యించుకునే రాజా రావ్ కూతురు తనతో ఎంత పరిచయంగా మాట్లాడుతూంది!’ సుందరం కెందుకో నవ్వు వచ్చింది.

“ఏమిటి నవ్వుతున్నారు? నా పరి చయం బాగా లేదా?”

“ఇన్‌స్పెక్టర్‌గారి అమ్మాయి నా లాటి వాడి ఇంటి కొచ్చి మాట్లాడు తోందని తలుచుకుంటేనే ఎందుకో నవ్వొస్తున్నది.”

“అదేమిటండోయ్, ఇన్‌స్పెక్టర్ల కుటుంబాల వాళ్ళు మనుషులతో మాట్లాడ్డమే విచిత్రమా ఏమిటి కొంప దీసి?”

“మనుషులతో మాట్లాడ్డం విచిత్రం కాదు.”

“మరి?” కనుబొమలు ముడిచింది.

“ ... మీ కర్థం కాదు లెండి.” సూటిగా సమాధానం చెప్పలేకపోయాడు.

ఆకాశం కొద్దిగా తెరిపి ఇచ్చింది. చినుకులు పడుతూనే ఉన్నాయి. రోడ్డు మీద సందడి మొదలైంది. పుస్తకాలు సర్దుకుని కుర్చీలోంచి మెల్లగా కదిలింది గీత.

“ఇంకా కొద్దిగా జల్లు పడుతున్న ట్లుంది. టాక్సీ పిలుస్తాను. అందులో వెడుదురుగాని.”

“నేను ఇన్‌స్పెక్టరుగారి అమ్మాయిని. మనుషుల మర్యాదలు మేం స్వీకరించం.” కొంటెగా పలికిన గీత కేసి సన్నగా నవ్వి రోడ్డు మీదికి నడిచాడు సుందరం. మౌనంగా వెనకాలే అడుగులు వేసింది గీత. మునిసిపాలిటీకి పట్టని ఆ రోడ్డుమీద గుంటల్లో నిలిచిన నీళ్ళు గాలికి కొట్టుకు వచ్చిన ఊళ్ళోని చెత్తా చెదారం. గీత కసహ్యంగా తోచింది అక్కడ నిలబడ డానికి.

“హల్లో, గురు! ...” స్వరున దూసు కొచ్చి పక్కగా నిలిపిన టాక్సీలోంచి పళ్ళ మధ్య బీడీని అదిమి పెట్టి సుంద రాన్ని పలకరించాడు ఇస్మాయిల్. “బాడుగ లేం లేకపోతే ఈ అమ్మాయిని ఇన్‌స్పె క్టర్ రాజారావ్ ... తెలుసుగా? ఇంటి దగ్గర దింపెయ్యి.” సుందరం మాట లకు విస్మయంగా చూశాడు ఇస్మాయిల్. కళ్ళతోనే జవాబిచ్చాడు సుందరం. బీడీ తీసి డాష్‌బోర్డు మీద పడేసి డ్రైవింగ్ సీట్లో వెనక్కి వాలి డోర్ తెరిచాడు. “థాంక్స్” చెప్పి బాక్ సీట్లో కూర్చుంది గీత. వెలుపల్నించి డోర్ చేరవేశాడు సుందరం. టాక్సీ కదిలి వెళ్ళి పోయింది. కానీ, సుందరానికి తెలియదు ఇస్మాయిల్ చెప్పేదాకా ఇన్‌స్పెక్టర్ రాజారావ్ కూతురు గీత మధ్యలోనే టాక్సీ దిగి ఇంటికి నడిచివెళ్ళిందని.

* * *

“హల్లో! ...”

నడుస్తున్న గీత ఆగి వెనుదిరిగి చూసింది. ఆ రోజు కురిసిన వర్షం, వర్షం నాటి ఆశ్రయం, ఆశ్రయం తాలూకు వ్యక్తి...దగ్గిరవుతున్న మూర్తిని పోల్చుకుంది. ప్రతిగా విష్ చేసింది సుందరం కేసి. మౌనంగా అడుగువేయ సాగా రిరువురూ.

“మీరు రాజారావ్‌గారి అమ్మా యనుకున్నాను. కానీ, మీరు ఇన్‌స్పెక్టర్ రాజారావ్‌గారి అమ్మాయే.” పలికాడు సుందరం గీతకేసి చూసి.

“అంటే?” కనుబొమలు ముడిచింది గీత.

“టాక్సీ దిగి వెళ్ళిపోయారట.”

“ఎవరు చెప్పారు?”

“ఇస్మాయిల్.”

“ఇస్మాయిల్ అంటే ... ఓ ... అయామ్ సారీ!”

“నెవర్ మైండ్.”

సుందరంకేసి చూడలేకపోయింది గీత. దగ్గరయిన హారన్ మోతకు పక్కగా తప్పుకున్నారు. సిటీ బస్ వచ్చింది. ఆగింది. ఫుట్‌బోర్డు మీది కండక్టర్ వెనక్కి ఒదిగాడు. బస్ ఎక్కింది గీత. టికెట్ తీసుకుని ఓ మారు రోడ్డు మీదికి చూసింది. సుందరం లేడక్కడ. బస్ కదిలిపోయింది.

* * *

“హార్టీ వెల్‌కమ్, ఇన్‌స్పెక్టర్ రాజా రావ్!” స్వాగతం పలుకుతూ ఎదు రొచ్చాడు కంట్రాక్టర్ మాధవరావ్. మిసెస్ మాధవరావ్ అందించిన గులా బీని అందుకుని కృతజ్ఞతగా నవ్వి, మెళ్ళో పైె సవరించుకుంటూ హాల్లోకి నడి చాడు రాజారావ్.

అందంగా అలంకరించబడ్డ హాలు. కళ్ళు చెదిరే అలంకరణలతో మిసమిస లాడిపోతున్న ఆడా మగా జంటలు. నాసికా పుటల్ని మత్తుగా తాకుతూన్న లవెండర్ పరిమళం. ఎదురుగా టేబిల్ మీద విస్కీ బాటిల్స్, గ్లాసులు. మరో వైపు స్టీల్ ట్రేల్లో ఆపుల్స్, బిస్కెట్స్, కాష్యూనట్స్, ఎగ్స్. హాల్లో ఓ మూలన మెల్లగా వినవస్తూన్న బీటిల్స్ వాద్యం. “ఇంతకీ పుట్టినరో జెవరిది?” నవ్వుతూ అడిగాడు, చుట్టూ ఖరీదుగా మెరిసిపో తున్న వ్యక్తుల్ని పరికిస్తూ రాజారావ్.

“వాటే వండర్‌ఫుల్ జోక్! పార్టీ చేసుకోవాలి. అందు కో అకేషన్ కావాలి. దట్సాల్! ...” ఏదో చిదంబర రహ స్యాన్ని రివీల్ చేసినట్లుగా బిగ్గరగా నవ్వాడు గారపళ్ళతో, హోల్‌సేల్ మర్చెంట్ మధుసూదన్రావ్. ‘అవు’ నన్నట్లు మిగతావాళ్ళు కూడా శ్రుతి కలిపారు. రాజారావ్‌కి అర్థం కాలేదు వాళ్ళ ధోరణి. బాటిల్స్ ఓపెన్ చేసి గ్లాసుల్లో పోసి, సోడా కలుపుతున్నాడు మాధవరావ్.

“కమాన్ ఇన్‌స్పెక్టర్. టేక్ యువర్ ఓన్ ఛాయిస్. ఇదంతా మీకోసం.” రాజారావ్ చేయి పట్టుకుని టేబిల్‌కి దగ్గరగా నడిపించబోయిన డాక్టర్ పటేల్‌ని వారిస్తూ, “సారీ, అకేషన్ తెలియకుండా ఆహ్వానం అందుకోవటం నా కలవాటు లేదు” అని పటేల్ చేతిని మృదువుగా విడిపించుకుంటూ నిలబడ్డ చోటే ఆగిపోయాడు రాజారావ్.

“ఆల్‌రైట్. మీరు భవిష్యత్తులో మాకు చేయబోయే కొన్ని అమూల్య మైన సహాయం సందర్భంగా ఇది మా ఉడుతా భక్తి. ఆర్ యూ సాటిస్ ఫైడ్ నౌ?” మాధవరావ్ పలికాడు.

తెలివిగా వాళ్ళు పన్నిన ట్రాప్ అర్థ మయింది రాజారావ్‌కి. ఇలాటి మందల్లో చేరిపోయి ఉంటే ఎప్పుడో వాళ్ళను మించిపోయే వాడు. కానీ, అతడి జీవితం అది కాదు. నమ్ముకున్న ప్రిన్సిపుల్స్

ఆలింగనం

పి. ఆగాచార్య ( కరీంనగర్



